# అట్రాక్ట్ ఫర్ ఓట్

- జిల్లాలో ఆదర్శ పోలింగ్ కేంద్రాలు
- తక్కువ పోలింగ్ జరిగిన కేంద్రం ఎంపిక
- సెగ్మెంట్‌కొకటి చొప్పున ఏర్పాటు



కలెక్టరేట్, అక్టోబర్ 24: ఓటర్లను ఆకర్షించి ఎన్నికల్లో వందశాతం పోలింగ్ పూర్తి చేసేందుకు ఎన్నికల సంఘం అనేక ప్రయత్నాలు చేస్తున్నది. ఈ క్రమంలో 18 ఏళ్లు నిండిన యువతీయువకులతో ఓటరు నమోదు ప్రక్రియను ఇంకా కొనసాగిస్తూనే ఉంది. చిరునామా మార్పిడి, ఒక ఇంట్లోని ఓటర్లందరూ ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేలా కూడా చర్యలు చేపట్టింది. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల్లో ఓటు వేసే విధానంపై ఈవీఎం యంత్రాలతో క్షేత్రస్థాయి ప్రచారం కూడా చేస్తున్నది. అలాగే, వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు, యువత కోసం ప్రత్యేకంగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసింది. ఎనభై ఏళ్లకు పైబడిన వారితో పాటు 70 శాతానికి పైబడి అంగవైకల్యం కలిగి ఉన్న వారి కోసం ఓట్ ఫ్రం హోమ్ అనే నినాదంతో ఇంటి నుంచే ఓటు వేసే విధానానికి శ్రీకారం చుట్టింది. తాజాగా, మరో పద్ధతికి అంకురార్పణ చేస్తూ ప్రకటించింది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో తక్కువ పోలింగ్ జరిగిన కేంద్రాన్ని గుర్తించి, ఆదర్శ పోలింగ్ కేంద్రంగా ప్రకటించింది. అక్కడ పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పిస్తూ, ఆ కేంద్రంలో వందశాతం పోలింగ్ జరిగేలా చర్యలు తీసుకునేలా ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేస్తున్నది. ఆదర్శ పోలింగ్ కేంద్రం పరిధిలోని బీఎల్‌వోలు ప్రతి ఓటరు ఇంటికి వెళ్లి వారి ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తూ, ఓటర్లందరినీ చైతన్యపరిచే కార్యక్రమాలు చేపడుతున్నారు. జిల్లాలోని నాలుగు అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో ఒక్కోటిచొప్పున నాలుగు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు ఎన్నికల అధికారులు కసరత్తు చేస్తుండగా, అధికారులు, స్థానిక ప్రతినిధులు, యువత సంయుక్తంగా కృషి చేస్తే, లక్ష్యం చేరుకోవడం సులువేనని ఎన్నికల సిబ్బంది పేర్కొంటున్నారు.

## అభ్యర్థులు తస్మాత్ జాగ్రత్త

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ ప్రచార ఖర్చులు, ఈసీకి లెక్కల అందజేత విషయంలో అత్యంత జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుంది. లేకుంటే, రాబోయే ఎన్నికల్లో తిరిగి పోటీ చేసేందుకు అనర్హులుగా మారే అవకాశముంటుంది. ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 10-ఏ ప్రకారం ఇప్పటికే ఉమ్మడి జిల్లా పరిధిలోని రామగుండం, కరీంనగర్ అసెంబ్లీ సెగ్మెంట్ల నుంచి ఒక్కొక్కరు చొప్పున ఇద్దరు అభ్యర్థులపై ఎన్నికల సంఘం ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హత వేటు వేసింది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని రెండు అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో పోటీ చేసిన ఇద్దరు అభ్యర్థులు నిబంధనల మేరకు ఖర్చు వివరాలు ఎన్నికల కమిషన్‌కు అందజేయలేదు. వారిపై 2021 జూన్‌లో అనర్హత వేటు వేసింది. దీంతో, ఈ ఎన్నికల్లో వారు పోటీకి అనర్హులుగా మారారు. ఎన్నికల కమిషన్ సూచించిన మేరకే ఎన్నికల్లో ఖర్చు చేయాల్సి ఉండగా, ఆమొత్తానికి కూడా నిర్దేశించిన మేరకు విధిగా లెక్కలు చెప్పాల్సి ఉంటుంది. ఎన్నికలు ముగిసిన 90 రోజుల్లో ఖర్చుల వివరాలు ఆధారాలతో ఎన్నికల సంఘానికి అప్పగించాలి. ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా ఎన్నికల సంఘం నుంచి నోటీసులు అందుకోవాల్సిందే. అయినా, స్పందించకుంటే మూడేళ్ల పాటు పోటీ చేయకుండా వేటు తప్పదు. అభ్యర్థులంతా గమనించి, ఖర్చుల వివరాలు జాగ్రత్తగా నమోదు చేసుకుని, ఎప్పటికప్పుడు రిటర్నింగ్ అధికారులకు అందజేయాలని జిల్లా ఎన్నికల అధికారి, డాక్టర్ బీ గోపి స్పష్టం చేశారు.

# బీఆర్ఎస్ గూటికి మాజీ ఎంపీపీలు

- త్వరలో చేరనున్న సీ సత్యనారాయణరెడ్డి, వేముల రామ్మూర్తి
- ఇప్పటికే కాంగ్రెస్ పార్టీకి రాజీనామా • నేడో రేపో గులాబీ కండువా కప్పనేందుకు సిద్ధం
- పెద్దపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీలో ప్రకంపనలు



మాజీ ఎంపీపీ సీ సత్యనారాయణరెడ్డి



మాజీ ఎంపీపీ వేముల రామ్మూర్తి

పెద్దపల్లి, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ) : పెద్దపల్లి నియోజకవర్గ కాంగ్రెస్‌లో రేగిన ప్రకంపనలు తగ్గలేదు. రాహుల్ పర్యటనకు ముందు రోజే ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు సీనియర్ కాంగ్రెస్ నాయకులు, ఎంపీపీలు చింతలఫణి సత్యనారాయణరెడ్డి, వేముల రామ్మూర్తి, జడ్పీ మాజీ కో-ఆప్షన్ సభ్యుడు హాజీ ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, త్వరలోనే వారి భవిష్యత్ ప్రణాళికను ప్రకటిస్తామని చెప్పగా, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని బీఆర్ఎస్‌లోనే చేరేందుకు నిర్ణయించారు. ఈ మేరకు పార్టీ అధిష్ఠానంతో ఇప్పటికే సంప్రదింపులు జరిపారు. నేడో, రేపో హైదరాబాద్‌లో వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో వీరు ముగ్గురు బీఆర్ఎస్ పార్టీలో చేరనున్నారు. బీఆర్ఎస్‌లో 2001నుంచి ఆ పార్టీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా సీ సత్యనారాయణరెడ్డి సుదీర్ఘ కాలం పాటు పనిచేశారు. ఆ తర్వాత తెలంగాణ ఆవిర్భావ సమయం లో కాంగ్రెస్‌లో చేరారు. టీఆర్ఎస్ తొలి నాళ్లలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా పనిచేసిన సత్యనారాయణరెడ్డికి ఉద్యమకారులతో మంచి సంబంధాలు ఉన్నాయి. పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అధిష్ఠాన వర్గం నేతలతోనూ అనుబంధం ఉన్నది. కాంగ్రెస్ పార్టీలోని అంతర్గత విభేదాలు, సీనియర్ల పట్ల నిర్లక్ష్య వైఖరి, డబ్బు ఉన్నవారికే ప్రాధాన్యం ఇవ్వడం, అవమానాలకు గురి చేయడం లాంటి ఘటనలను విభేదిస్తూ ఇటీవల కాంగ్రెస్‌కు రాజీనామా చేస్తున్నట్లు వారు ప్రకటించారు. ఈ క్రమంలో అభివృద్ధికి, సంక్షేమానికి పెద్దపీట వేస్తూ తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చుతున్న బీఆర్ఎస్‌లోనే చేరాలని నిర్ణయించారు. రాహుల్ పర్యటనకు ముందు నలుగురు కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఆ పార్టీకి గుడ్‌బై చెప్పడం వారిలో ముగ్గురు నేతలు బీఆర్ఎస్‌లో చేరుతుండడంతో పెద్దపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీని ఒక కుదుపు కుదిపింది. జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్‌లోని పలువురు సీనియర్లు సైతం వీరి బాటలోనే నడుస్తున్నట్లు తెలుస్తోంది.

## నేడో రేపో బీఆర్ఎస్‌లోకి..

కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన మాజీ ఎంపీపీలు సీ సత్యనారాయణరెడ్డి, వేముల రామ్మూర్తి, కరీంనగర్ ఉమ్మడి జిల్లా మాజీ కోఆప్షన్ సభ్యుడు హాజీ నేడో, రేపో బీఆర్ఎస్‌లో చేరనున్నారు. ఈమేరకు బీఆర్ఎస్ అధిష్ఠానానికి సమాచారం అందించినట్లు తెలిసింది. ఈ విషయంపై సీ సత్యనారాయణరెడ్డిని వివరణ కోరగా త్వరలోనే తాము ముగ్గురం బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు తెలిపారు.



← మాట్లాడుతున్న సీపీ సుబ్బారాయుడు



↑ సమావేశానికి హాజరైన పోలీస్ అధికారులు, కేంద్ర బలగాలు

# ఎన్నికల నియమావళి పాటించాలి

- సీపీ సుబ్బారాయుడు
- ఎన్నికల నేపథ్యంలో ఉన్నతాధికారులతో సమావేశం

రాంనగర్, అక్టోబర్ 24: జిల్లా ప్రజలు పోలీసులకు, కేంద్ర బలగాలకు సహకరిస్తూ ఎన్నికల కమిషన్ నిర్దేశించిన ఎన్నికల నియమావళిని పాటిస్తూ స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని సీపీ సుబ్బారాయుడు కోరారు. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా కేంద్ర ఎన్నికల సంఘం కేటాయించిన కేంద్ర పోలీసు బలగాల ఉన్నతాధికారులతో మంగళవారం ఆయన కమిషనరేట్ కేంద్రంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, ప్రీ-పోలింగ్, పోలింగ్ డే, పోస్ట్ పోలింగ్ ఆక్టివిటీస్ గురించి వారికి తెలియజేశారు. కేంద్ర బలగాల సహకారంతో జిల్లాలో ఏరియా డామినేషన్, ఫ్లాగ్ మార్చ్, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలున్న ప్రాంతాల్లో పాయింట్ పెట్రోలింగ్ నిర్వహిస్తామని ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీలలో వీరిని నియమిస్తామని, క్యూఆర్‌టీలుగా విభజించి సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక ఫూట్ పెట్రోలింగ్ కోసం ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు ఎవరైనా పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అడిషనల్ డీసీపీ (పరిపాలన) రాజు, సీఏపీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్లు మురుగవేల్, అనుజ్ కుమార్, సంజయ్ కుమార్, ఏసీపీలు నరేందర్, కరుణాకర్ రావు, ఏసీపీ ప్రతాప్, సీసీఆర్‌బీ ఎన్నికల సెల్ ఏసీపీ విజయ్‌కుమార్, సీఏపీఎఫ్ ఇన్‌స్పెక్టర్ విపిన్ సింగ్, అభయ్ సింగ్, కమిషనరేట్‌లోని సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

# మీ పోలింగ్ కేంద్రం తెలుసుకోవాలా..?

- ఓటరు సహాయ మిత్రతో వివరాలు లభ్యం • నవంబర్ 10 నుంచి పోలింగ్ స్లిప్పుల పంపిణీ

కరీంనగర్ కలెక్టరేట్, అక్టోబర్ 20 : త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తాము ఓటు వేయాల్సిన పోలింగ్ కేంద్రం వివరాలు తెలుసుకునేందుకు ఓటరు సహాయ మిత్రను వినియోగించుకోవచ్చు. కేంద్ర ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో ఉన్న ఈ యాప్‌తోపాటు ఓటర్ హెల్ప్ లైన్ యాప్ ద్వారా కూడా తెలుసుకునే అవకాశమున్నది. పోలింగ్ కేంద్రాలకు వెళ్లే ముందే ఓటర్లు తాము ఓటు వేయాల్సిన బూత్ ఎక్కడుందో సమగ్రంగా తెల్సుకోవాలి. ఈసారి కుటుంబాల వారీగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో గతంలో మాదిరి కాకుండా, కుటుంబంలో ఓటు హక్కు కలిగి ఉన్న వారందరికీ ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు వేసే అవకాశం కల్పిస్తున్నారు. ఈ క్రమంలో ఓటర్లు పీసీలు మారనున్న దృష్ట్యా, ముందుగానే వివరాలు తెలుసుకోవడం మూలంగా ఇబ్బందులు తప్పనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారులు పేర్కొంటున్నారు. అలాగే, నవంబర్ 10 వరకు నామినేషన్ల పర్వం ముగియనుండగా, ఆ మరుసటి రోజు నుంచి ఓటర్లకు పోలింగ్ స్లిప్పులు పంపిణీ చేయనున్నట్లు వెల్లడిస్తున్నారు. గతంలో ఎదుర్కొన్న అనుభవాల నేపథ్యంలో ఈసారి ఎలాంటి సమస్యలకు ఆస్కారం లేకుండా ఓటర్లు పోలింగ్‌లో పాల్గొనేలా ప్రోత్సహించే క్రమంలో, ఇరవై రోజుల ముందుగానే పోలింగ్ స్లిప్పులు పంపిణీ చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం సూచించినట్లు జిల్లా యంత్రాంగం పేర్కొంటున్నది. వాస్తవానికి ఎన్నికల సంఘం ద్వారా మాత్రమే పోలింగ్ స్లిప్పులు పంపిణీ చేయాల్సి ఉంటుంది. అయితే, ఓటర్లను ఆకర్షించే క్రమంలో బరిలో నిలిచిన అభ్యర్థులు కూడా ఓటర్లకు పోలింగ్ స్లిప్పులు పంపిణీ చేస్తుండడం ఆనవాయితీగా వస్తోంది. గత అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో మాత్రం అటు అభ్యర్థులు, ఇటు ఎన్నికల సంఘం కూడా పోలింగ్ స్లిప్పులు సక్రమంగా పంపిణీ చేయకపోవడంతో, తమ ఓటు ఎక్కడుందో తెల్సుకునేందుకు ఓటర్లు నానా అగచాట్లు పడాల్సి వచ్చింది. దీంతో, కొంతమంది ఓటు వేయకుండానే వెనుక్కు తిరిగిపోగా, మరికొంత మంది అలాగే, వేచి చూస్తుండడంతో పోలింగ్ సమయం ముగిసిన అనంతరం కూడా అనేకచోట్ల ఓట్లు వేశారు. వీటిని దృష్టిలో పెట్టుకున్న ఎన్నికల సంఘం ఈసారి నిర్దిష్ట సమయంలోనే వందశాతం పోలింగ్ పూర్తి చేసేందుకు ప్రణాళికబద్ధంగా వ్యవహరిస్తోంది. ఇందులో భాగంగానే ప్రతి ఓటరుకు పక్కాగా పోలింగ్ స్లిప్పు అందేలా ముందస్తుగానే చర్యలు చేపట్టింది.

# అర్ధనారీశ్వరీ అలంకరణలో దుర్గాభవానీ

కరీంనగర్ రూరల్, అక్టోబర్ 24: కరీంనగర్ రూరల్ మండలం నగునూర్‌లోని దుర్గాభవానీ ఆలయంలో శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారు అర్ధనారీశ్వరీ అలంకరణలో నంది, సింహవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి ఆలయ ధర్మాధికారి పురాణం మహేశ్వర శర్మ ఆధ్వర్యంలో ఆలయ ప్రధానార్చకుడు పవనకృష్ణ శర్మ ప్రత్యేక హారతులిచ్చి పూజలు చేశారు.



అర్ధనారీశ్వరీ అలంకరణలో దుర్గాభవానీ అమ్మవారు ➤

# నిద్రలోనే సజీవ దహనం

- నిద్రలోనే సజీవ దహనమైన ఇంటి యజమాని • వస్తాపూర్‌లో ఘటన

రాయికల్, అక్టోబర్ 24: విద్యుద్ఘాతంతో ఇల్లు దగ్ధంకాగా, ఇంటి యజమాని సజీవ దహనమైన ఘటన జగిత్యాల జిల్లా రాయికల్ మండలం వస్తాపూర్‌లో సోమవారం రాత్రి జరిగింది. రాయికల్ ఎస్ఐ అజయ్ తెలిపిన వివరాల ప్రకారం.. వస్తాపూర్ గ్రామానికి చెందిన సంకె చిన్న భూమయ్య (38) ఊరిలో కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తుంటాడు. భార్య లక్ష్మి తన ముగ్గురు పిల్లలతో రెండ్రోజుల క్రితం సారంగాపూర్ మండలం రేచపల్లిలోని తన తల్లి గారి ఇంటికి వెళ్లింది. ఇంటి వద్ద చిన్న భూమయ్య ఒక్కడే ఉంటున్నాడు. ఈనేపథ్యంలో సోమవారం రాత్రి చిన్న భూమయ్య ఇంట్లో నిద్రిస్తుండగా ప్రమాదవశాత్తూ ఇంట్లో షార్ట్‌సర్క్యూట్ అయి ఇల్లుపూర్తిగా కాలిపోయింది. నిద్రిస్తున్న సమయంలో ఇంటికి మొత్తం మంటలు అంటుకోవడంతో అవే మంటల్లో చిన్న భూమయ్య సజీవ దహనమయ్యాడు. భార్య ఫిర్యా దుమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.